జిల్లాలో ఘనంగా మేడే వేడుకలు

ఎస్.కోటలో ర్యాలీలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర నేత కామేశ్వరరావు

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలో మేడే వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా సిపిఐ, ఎఐటియుసి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు పి.కామేశ్వరరావు ఆద్వర్యంలో శృంగవరపుకోటలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దేవి బొమ్మజంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని యూనియన్లకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. విజయనగరంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రంగరాజు, బుగత అశోక్ల ఆద్వర్యంలో పలు ప్రాంతాలలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. గజపతినగరంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆద్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. బొబ్బిలిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్నల ఆద్వర్యంలో మేడే వేడుకలను జరిపారు. అలాగే అన్ని నియోజకవర్గాలలోను, మండల కేంద్రాలలోనూ ఎఐటియుసి జెండాలు ఎగురవేసారు.

విద్యా దీపాన్ని వెలిగించిన మహర్షి పీవీజీ రాజు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: సమాజంలో ప్రజలు చైతన్యవంతులు కావాలంటే బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి విద్యను అందించేందుకు స్వర్గీయ పీవీజీ రాజు భావించి మాన్సాస్ సంస్థలు స్థాపించారని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యుడు స్వర్గీయ పీవీజీ రాజు 101వ జయంతిని డాక్టర్ పీవీజీ రాజు కళావేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అధ్యక్షతన గురువారం గురజాడ జిల్లా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో కూడా పీవీజీకి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ మాన్సాస్ విద్యా సంస్థల్లో చదువుకోవడం గొప్ప అదృష్టంగా ప్రజలు భావించేవారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. పీవీజీ జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో ప్రముఖులైన వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసుల నాయుడు, పెనుమత్స సురేష్ బాబు, రామ నారాయణం అధినేత నారాయణ శ్రీనివాస్, డాక్టర్ జి.బి.వెంకట్, హోమియో డాక్టర్ గాడి ప్రసాద్, స్వచ్ఛంద సేవకురాలు చీకటి చంద్రికా రాణి, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడులను ఘనంగా సత్కరించారు.

నాటుసారా బట్టీపై దాడులు

విశాలాంధ్ర - గుర్ల: నవోదయమ్ 2.0లో భాగంగా నెల్లిమర్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు ఆధ్వర్యంలో ఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి గుర్ల మండలం దేవునికనపాక గ్రామంలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఐదు లీటర్ల నాటుసారాతో పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో హెచ్‌సీలు ఎం.అప్పారావు, వి.కృష్ణ, పీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర -విజయనగరం : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు ప్రాంతాలలో పర్యటించి, పారిశుధ్య ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా సిబ్బంది పంపిణీ చేస్తున్న పింఛన్ ప్రక్రియను గమనించారు. శతశాతం పింఛన్ పంపిణీ లక్ష్యంగా కృషి చేయాలని కార్య దర్శులకు ఈ సందర్భంగా సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతినెలా ఒకటో తేదీ కల్లా పింఛన్ అందించే పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దీని ద్వారా త్వరితగతిన పింఛన్లు అందజేసి లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: విజయనగరంలో పూల్ బాగ్ కాలనీ మెయిన్ రోడ్‌లో ప్రగతి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు వరకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్, అయ్యప్ప నాయుడు, సూరిబాబు, కోటేశ్వరరావు, రామారావు, శ్రీనివాసరెడ్డి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేత

విశాలాంధ్ర - భోగాపురం: మండలంలో ముంజేరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను ఎమ్మెల్యే లోకం మాధవి టిడిపి, బిజెపి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా వితంతు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లు అందజేశారు. వారికి పింఛన్ సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ పార్టీల నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డీసీసీబీ అభివృద్ధికి కృషి: చైర్మన్ నాగార్జున

విశాలాంధ్ర - చీపురుపల్లి: అందరి ఆశీస్సులతో డీసీసీబీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం చీపురుపల్లిలోని తన స్వగృహంలో పలువురు ప్రముఖులు నాగార్జునను కలిసి సత్కరించారు. నెల్లిమర్ల నియోజకవర్గ శాసనసభ్యులు లోకం నాగ మాధవి విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జునను చీపురుపల్లిలో కలిసి జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు తనకు అప్పగించిన బాధ్యతలను

సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. అదేవిధంగా టీడీపీ నాయకులు రౌతు కాము నాయుడు, రౌతు నారాయణరావు, డీసీసీబీ విజయనగరం జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సెక్రెటరీ బి.అచ్యుతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ నాయుడు, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు కలిసి నాగార్జునను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కంది చంద్రశేఖరరావు, కలిదిండి పాణి రాజు, పల్లేడ భాస్కరరావు, జనసేన నాయకులు మట్టా అయ్యప్ప, చెల్లిబోయిన రాము, కొవ్వాడ రఘు, పతివాడ రఘు, కనకాల రామారావు, బంటుమల్లి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు
వాడవాడలా మేడే వేడుకలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటాలు చేసి హక్కులు, చట్టాలు కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మిక సమస్యలపై అవగాహన కల్పించడమే మేడే దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద కార్మిక జెండాను ఆవిష్కరించి, కార్మిక చిహ్నంతో సీపీఐ కార్యకర్తలు ఆర్టీసీ డిపో వరకు ఊరేగింపు నిర్వహించి శ్రామికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో వసంతోత్సవాలతో కూడిన మే డే కార్యక్రమాలు ప్రకృతి-మానవుల పరస్పర బాంధవ్యాన్ని ప్రతిబింబించాయని కామేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కే.బీముడు, ముఠా సంఘం నాయకులు శ్రీను, ఇతర కార్మిక నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయకపోతే మరో చికాగో పోరాటం
ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం టౌన్: సిపిఐ, ఏఐటీయూసీ విజయనగరం జిల్లా సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో స్థానిక మార్బు నగర్ (బుచ్చెన్న కోనేరు) శాఖలో 3 చోట్ల, బలిజివీధి శాఖలో 2 చోట్ల, శాంతినగర్ శాఖలో, విజయనగరం కాల్ గ్యాస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మొకర అప్పారావు విగ్రహం దగ్గర, విజయనగరం పి.డబ్ల్యూ మార్కెట్ ఎంప్లాయిస్ అండ్ ముఠా వర్కర్స్ యూనియన్ శాఖలో 5 చోట్ల, టింబర్ మార్కెట్లో, ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో ఫ్లోర్ మిల్లు దగ్గర, పార్టీ జిల్లా కార్యాలయం మేడ మీద, చిన్నవీధి ఫర్నిచర్ కార్మిక యూనియన్ దగ్గర, మహారాజా, ఘోషా ఆసుపత్రిల దగ్గర మొత్తం 18 చోట్ల జరిగిన 139వ మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ దేశ సంపద సృష్టికర్తలు కార్మికులకు, దేశప్రజలికి అన్నం పెడుతున్న కర్షకులకి 139 వ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవంగా మేడే ను 139 ఏళ్ళుగా శ్రామికజన సంఘీభావ చిహ్నంగా, కార్మిక పర్వదినంగా మేడేను జరుపుకుంటు న్నామని అన్నారు. మనదేశంలో కార్మికుల జీవితాలకు సవాలుగా నిలిచిన మతతత్వం, నూతన ఆర్థిక సంస్కరణల ఫలితంగా బహుళజాతి సంస్థల శ్రమ దోపిడీ నుంచి కాపాడుకునేందుకు దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను, కార్మిక హక్కులను రక్షించుకునేందుకు చికాగో నగర పోరాటాన్ని స్మరించుకుంటూ నేడు బీజేపీ అవలంభిస్తున్న ఆర్థిక, సామాజిక దోపిడీ విధానాల పై పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు, పార్టీ శాఖా కార్యదర్శులు, యూనియన్ నాయకులు ఎం.సూరినాయుడు, కాళ్ళ మురళి, తాడ్డి అప్పలనాయుడు, ఎన్.పాపునాయుడు, ఎమ్.చిన్న, ఎం.రామారావు, పి.శ్రీను, సి.హెచ్.శ్రీను, డి.కృష్ణ, దేవుడు, మురళి, సురేష్, సాయిరాం మేస్త్రీ రవి, ఎమ్.నారాయణరావు, అప్పరుబోతు జగన్నాధం, చిల్లా చిట్టిబాబు, పొందూరు అప్పలరాజు, బూర వాసు, పి.గౌరీ శంకర్, వడ్డది కొండలరావు, కార్మికులు పాల్గొన్నారు.

గజపతినగరం: ఏఐటీయూసీ, సిపిఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఏఐటీయూసీ అనుబంధ విభాగాలైన భవన నిర్మాణ కార్మికులు, నాయకులు శ్రీనివాస్ తదితరులు పతాకావిష్కరణ గావించారు. అనంతరం ఒమ్మి రమణ మాట్లాడుతూ కార్మికులు ఐక్యతతో పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. కార్మిక హక్కులను కాపాడుకుందాం, మతోన్మాదాన్ని ఎదిరిద్దాం అని దోపిడీని అంతం చేస్తాం అని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఉచితంగానే భూములను, ప్రజల ఆస్తులను అప్పజెప్పి దానికి సిద్ధపడుతున్నారే తప్ప కార్మికులకు సంక్షేమానికి బాధ్యత వహించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గజపతి నగరం ఏరియా నాయకులు అప్పారావు, భవన నిర్మాణ కార్మిక నాయకులు శ్రీను, మంత్రి రామారావు, సిపిఐ నాయకులు గేదెల రామునాయుడు, నారాయణరావు, కళాసీలు ఆది, శ్రీను పాల్గొన్నారు.

రాజాం: రాజాం బస్టాండ్ ఆవరణలో రాజాం మోటార్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆఫీస్ వద్ద మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మజ్జి కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, సీపీఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి కనకరాజు, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, తిరుపతిరావు, జట్టు కలసిలు తదితరులు పాల్గొన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు యూనియన్ ఆధ్వర్యంలో మే డే జెండాను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ ఆవిష్కరించారు.

దత్తిరాజేరు: దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి పార్టీలు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటుందని సీఐటీయూ నేతలు తెలిపారు. మేడే దినోత్సవం సందర్భంగా గురువారం ఆటో యూనియన్ అధ్యక్షులు దాలినాయుడు జెండా ఆవిష్కరణ చేశారు. కార్మిక చట్టాలలో మార్పు వెంటనే నిలిపివేయాలని అన్నారు. మెరుగైన వేతనాల కోసం చట్టాలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం కోమటిపల్లి ఆటో స్టాండ్ నుండి సంత తోట వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, ఆటో యూనియన్ కార్యదర్శి బి.అప్పలనాయుడు, ఈశ్వరరావు, కే.ఉమామహేశ్వరరావు, అంగన్వాడీ జిల్లా కమిటీ సభ్యులు పి.జ్యోతి, పద్మకల, దమయంతి, లక్ష్మణరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: సీఐటీయూ జిల్లా పూర్వ కార్యదర్శి చల్లా జగన్ ఆధ్వర్యంలో గురువారం వేపాడ, సోంపురం క్వారీ కూడలి, బొద్దాం ఆటో స్టాండ్లలో మేడే వేడుకలు నిర్వహించారు. వేపాడలో వల్లంపూడి ఎస్సై సుదర్శన్ చేతుల మీదుగా, సోంపురం క్వారీలో యూనియన్ నాయకులు బుద్ధ గోవింద, బొద్దాం ఆటో స్టాండ్లో ఆటో కార్మికులతో చలుమూరి శ్యామ్ చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ సుమారు 130 సంవత్సరాల క్రిందట అమెరికాలో 8గంటల పని దినం కావాలని కార్మికులు ప్రదర్శన చేస్తే అత్యంత ఘోరంగా ఆ ప్రదర్శనపై ఆనాటి అమెరికన్ ప్రభుత్వం కాల్పులు జరిపి వేలాది మంది కార్మికులను పొట్టన పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో క్వారీ కార్మిక నాయకులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి: కార్మికులు మేడే స్ఫూర్తితో పోరాట వారసత్వాన్ని కొనసాగించి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునకాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణం జండా మహల్ జంక్షన్ వద్ద మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, ఏపీటీఎఫ్ నాయకులు జేసీ రాజులు పాల్గొని కార్మిక జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పొడుగు అశోక్, ఎల్వీఆర్ మూర్తి, సత్యనారాయణమూర్తి, గొల్లపల్లి తౌడు, కొలుసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.అలాగే ఏపీ సివిల్ సప్లై హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్లు నరసింహులు, జట్టు మేస్త్రి పొందూరు గోపీ తదితరులు ఆధ్వర్యంలో పట్టణం అమ్మి గారి కోనేరు గట్టు వద్ద పార్టీ కార్యాలయంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ముల్లు నరసింహులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సివిల్ సప్లై హమాలీ సంఘం నాయకులు మొండి నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

వంగర: మేడే స్ఫూర్తితో కార్మికులంతా తమ హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా మాజీ కౌన్సిల్ సభ్యులు దర్రు రాంబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ రూపవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు పూర్వ నాయకులు, జిల్లాఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు మజ్జి గణపతి, వీఆర్ఏల సంఘ నాయకులు, దళిత బహుజన సంఘాల జేఏసీ నాయకులు మజ్జిగ గణపతిరావు, గంగులు, యజ్జల అప్పలస్వామి, పి.భారతి, జి.కుమారి, మీన, మరియమ్మ సత్యవతి పాల్గొన్నారు.

గంట్యాడ: గంట్యాడ మండలం నరవ గ్రామంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా నరవ జంక్షన్లో మాజీ సర్పంచ్ సుంకరి రాము నాయుడు, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి కాళ్ల కృష్ణ ఆధ్వర్యంలో గురువారం జండా ఎగరవేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఇది ఒక చారిత్రాత్మకమైన చైతన్య దినమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ కాళ్ల సత్తిబాబు, బోల్లు నరసయ్య, ఎర్రిబోతు అచ్చం నాయుడు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: కార్మికుల విశ్రాంతి దినం మే డే అని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గాడి అప్పారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయం నందు ఎర్రజెండా ఎగరవేశారు. మే డే దినోత్సవం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను, వారి చట్టాలను కాలరాస్తున్నాయని అన్నారు. పనికి తగ్గ వేతనం చెల్లించడం లేదని, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడంలో ఐకమత్యం లేక కోల్పోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు టి వెంకటరమణ, ఆశా వర్కర్లు జిల్లా కార్యదర్శి గొల్ల దేవి పాల్గొన్నారు.

మెంటాడ: రక్తాన్ని స్వేదముగా మార్చి అవరోధాలను మెట్లుగా మార్చుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ప్రతి కార్మికునికి మే డే శుభాకాంక్షలు తెలుపుతూ వారి ఆకాంక్షకు ఎర్రటి జెండా ఎప్పుడూ పోరాడుతూ ఉంటుందని వారికి తోడుగా ఉంటుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమీపంలో రాకోటి రాములు ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ అనేక కార్మిక సంఘాలు పోరాట ఫలితం నేడు కార్మికునికి స్వేచ్ఛ ఫలించిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు, రైతు సంఘం నాయకులు వాకదేవుడు, సిరిశెట్టి మంగమ్మ, గాడి రవణమ్మ, రెడ్డి దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కమ్యూనిస్టులారా ....ఏకంకండి

కన్నీరు పెట్టిన పీపుల్ స్టార్ ఆర్.నారాయణమూర్తి

విశాలాంధ్ర - బొబ్బిలి: ప్రపంచంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు అన్ని ఏకం కావాలని అప్పుడే కార్మిక కర్షక హక్కులు ఫలిస్తాయని అంతా ఏకమైనప్పుడే అక్కులు సాగిస్తామని పీపుల్ స్టార్ ఆర్ నారాయణ మూర్తి కమ్యూనిస్టులకు దండం పెట్టి కన్నీరు కార్చారు. కమ్యూనిస్టులంతా ఏకమైతే ఎర్రకోట పైన ఎరుపు జెండా ఎగురుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల కోసం చివర వరకు పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేసిన కామిరెడ్డి గంటి ప్రసాదం వసంతాడ రామలింగా చారి, సూరి నారాయణరావు పోరాట త్యాగాలను కొనియాడారు. దేశంలో అసంఘటిత రంగంలో 90 శాతం మంది కార్మికులు ఎటువంటి హక్కులు లేకుండా దుర్భర జీవితం అనుభవిస్తున్నారని, ఉన్న పరిశ్రమలు అంతా మూతపడ్డాయని ఉత్తరాంధ్రకు ఎటువంటి ఉపాధి లేదని అనేక సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయని జంఝావతి, నాగవళి, తోటపల్లి తదితర ప్రాజెక్టులు ఉన్నాయని ఇక్కడ వ్యవసాయం ఎంత అభివృద్ధి చెందిందని వ్యవసాయ ఆధారిత పరిశ్రమల రావాలని అందుకు పాలకులు కృషి చేయాలని కోరారు. అసంఘటిత రంగం పైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కళాసీ సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాల కార్యక్రమం పట్టణ కళాశాల సంఘం కార్యాలయం వద్ద కార్మికులు ఘనంగా మేడే జెండాను ఆవిష్కరణ చేసి కళాకారుల కళా ప్రదర్శన చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయనను కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీలో రైతు ఉద్యమ తర్వాత రైతులకు క్షమాపణ చెప్పి కార్మికులు రక్తతర్పణం చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను చట్ట సవరణ పేరుతో నాలుగు కోడ్ చేసి కార్మిక హక్కుల కాలరాసారని బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన కార్మిక చట్టాలు కోడ్ లు రద్దు కోసం కార్మిక కర్షకులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ, సిపిఎం, మరో 24 కమ్యూనిస్టు పార్టీలు అంతా ఏకం కావాలని ఆర్.నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేస్తూ బహిరంగ సభలో కన్నీరు పెట్టారు. అనంతరం తాండ్రపాపారాయ జంక్షన్ వద్ద అంతర్జాతీయ శ్రామిక పోరాట దినం మేడే బహిరంగ సభ పట్టణ కళాసి సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు వందలాదిమంది కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ బహిరంగ సభలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకురాలు ఎస్ ఝాన్సీ, బి.శంకర్రావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీను నాయుడు, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, కుర్రోతు శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఉపాధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-జామి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా కల్పించే సబ్సిడీ రుణాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి తెలిపారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్మెంట్ జనరేషన్ స్కీంలో భాగంగా జామి మండలంలోని రామయ్యపాలెం గ్రామానికి చెందిన మాకిరెడ్డి అప్పలనాయుడుకి రూ.1,05,000 సబ్సిడీతో రూ.3లక్షల విలువ గల ఆటో మంజూరు అయింది. ఆటోను లక్కవరపుకోటలోని తన స్వగృహంలో గురువారం లబ్ధిదారుడుకు తన చేతుల మీదుగా ఎమ్మెల్యే అందించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వివిధ పథకాలలో భాగంగా ప్రజలకు సబ్సిడీపై రుణాలను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేగపుణ్యగిరిలో డోలిమోతలే శరణ్యం

మార్గమధ్యలో గర్భిణీ ప్రసవం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: రేగపుణ్యగిరి గిరిజన గ్రామంలో రహదారి కష్టాలతో డోలిమోతలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి. మండలంలోని రేగపుణ్యగిరి గిరిజన గ్రామంలో ఫంగి సీతమ్మ (గర్భిణి) పురిటి నొప్పులతో బాధపడుతుండగా, భర్త నర్సింగరావు మరికొందరు గిరిజనులు డోలీలో మోసుకుని ఎస్.కోట ఆసుపత్రికి వెళ్తుండగా మార్గమధ్యలోనే ఆమె ఆడబిడ్డను ప్రసవించింది. పుణ్యగిరి కాలేజీ వద్ద జనసేన నేత సన్యాసి నాయుడు 108 అంబులెన్స్‌ను ఆపి తల్లి-బిడ్డను ఆసుపత్రికి తరలించారు. ఈ గ్రామంలో రహదారికి 4 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని సన్యాసినాయుడు ఆరోపించారు. ఈ నెలలో పనులు పూర్తి కాకపోతే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవలి ఐటీడీఏ సమావేశంలో గిరిజన మంత్రి సంధ్యారాణి ఫారెస్ట్ అనుమతులు ఇచ్చినట్లు సన్యాసి నాయుడు తెలిపారు. గర్భిణీని ఆసుపత్రికి తరలించేందుకు సహాయం చేసిన వారిలో మండల జనసేన నాయకులు కొల్లి సురేంద్ర తదితరులు ఉన్నారు.

కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బిహెచ్‌వి లక్ష్మీ కుమారి అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ డిపోలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక చట్టాలు, వేతన సవరణ చట్టం, హక్కులు బాధ్యతలు గురించి వివరించారు. కార్మికులు పని చేస్తున్న చోట పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా

లేవా అడిగి తెలు సుకున్నారు. కార్మికులకు ఏ విధమైన న్యాయ సేవ అవసరాలు ఉన్నా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలన్నారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 15100కి ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ కె.సూర్యప్రకాష్, డిపో మేనేజర్ జె.శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు జి.లలిత, జి.తిరుపతి, ఏపీ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ విజయ నగరంలో గల డిపో సిబ్బంది గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి నియోజకవర్గంలోని కొత్తూరు గ్రామంలో ముగ్గురు వితంతువులకు స్పౌజ్ పెన్షన్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ ఇలాంటి అర్హత గల వితంతువులు తగు డాక్యుమెంట్లతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాలక్ష్మి, టీడీపీ నాయకులు శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతా

నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం: నగరంలో వివిధ ప్రాంతాలలోని నిర్మాణాలకు పాక్షిక మరమ్మతులు చేపట్టి మరింత ఆకర్షణీయంగా దర్శనమిచ్చేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం గురజాడ కళాక్షేత్రం, పాలాస్పత్రి, మూడులాంతర్ల జంక్షన్, గాంధీ పార్క్ ప్రాంతాలను పరిశీలించారు. గురజాడ కళాక్షేత్రంలో జి.ఏ షెడ్ నిర్మించేందుకు,విద్యుత్ దీపాలు అమర్చేందుకు, అలాగే చదువుకునే విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేసి, పాక్షిక మరమ్మత్తులను చేపట్టేందుకు అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఆ తర్వాత ప్రసిద్ధ పాలాస్పత్రి ప్రాంగణానికి చేరుకుని పారిశుద్ధ్య కార్యక్రమాలకు అవసరమైన బ్లీచింగ్, డ్రమ్ములు ఇతర సామాగ్రి భద్రపరిచేందుకు ఆసుపత్రి వెనక వైపున షెడ్డు నిర్మాణానికి, అలాగే పాలాస్పత్రి ఔన్నత్యానికి విఘాతం కలగకుండా అవసరమైన మరమత్తు పనులు చేపట్టి అందంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అనంతరం మూడులాంతర్ల జంక్షన్ ను పరిశీలించి, పాక్షిక మరమ్మతులు చేపట్టి మరింత ఆకర్షణయంగా రూపుదిద్దే విధంగా చేపట్టాలన్నారు. మూడులాంతర్లు అనే నామఫలకాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆ తర్వాత గాంధీ పార్క్ చేరుకొని పరిసరాలను పరిశీలించారు. ఇప్పటికే అక్కడ మరుగుదొడ్ల నిర్మాణానికి టెండర్లు ప్రక్రియ పూర్తయిందని, పనులు తక్షణమే ప్రారంభించేలా చొరవ చూపాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రాశస్త్యమున్న కట్టడాలకు పాక్షిక మరమ్మతులు చేపట్టి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.

కుక్కలకు శతశాతం వ్యాక్సినేషన్ లక్ష్యం

విశాలాంధ్ర - విజయనగరం: కుక్కలకు శతశాతం వ్యాక్సినేషన్, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. గురువారం 19వ డివిజన్లో ప్రత్యేక సిబ్బంది కుక్కలను పట్టుకున్నారు. వాటిని కొత్తపేట వద్దనున్న డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్ కు తరలించారు. అక్కడ సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ ప్రక్రియను చేపడతారు. పూర్తిగా కోలుకున్నంత వరకు కుక్కలను అక్కడే ఉంచి అవసరమైన సదుపాయాలను కల్పిస్తారు. మరలా ఏ డివిజన్ నుంచి వాటిని తెచ్చారో అక్కడే విడిచి పెడతారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ కుక్కల నుండి ప్రజలకు ప్రమాదాలు జరగకుండా యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రక్రియను చేపడుతున్నామన్నారు. అలాగే కుక్కల వృద్ధిని తగ్గించేందుకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు కూడా చేపడుతున్నామన్నారు.

కళాసీ సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు

విశాలాంధ్ర-జామి: మడంల కేంద్రమైన జామిలోని శ్రీబసవేశ్వర కళాసీ సంఘం(ఎఐటియుసి అనుభందం) ఆధ్వర్యంలో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లో ఉన్న సంఘం కార్యాలయం వద్ద సంఘం నేత కృష్ణ జెండాను ఎగురవేసారు. ఈసందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలపై సమావేశంలో చర్చించుకుని వాటిని పరిష్కరించే నిమిత్తం జిల్లా

యూనియన్ నేతలకు తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో ఎస్‌కోటలో సిపిఐ రాష్ట్ర నాయకులు పి.కామేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించే భారీ ర్యాలీకి తరలి వెళ్ళారు.

చలో అమరావతికి కూటమి నేతలు పయనం

విశాలాంధ్ర - రాజాం: మాజీ మంత్రి, టీడీపీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సూచనల మేరకు ఛలో అమరావతికి కూటమి నేతలు పయనమయ్యారు. అమరావతి పనుల పునఃప్రారంభ పనులు ప్రారంభించేందుకు ముఖ్య అతిధితగా పాల్గొననున్న ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు శుక్రవారం భారీ సంఖ్యలో నియోజక వర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అయిదు బస్సులు, వివిధ ప్రైవేట్ వాహనాలలో అమరావతి పండుగలో పాల్గొనేందుకు పయనం అయ్యారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని చిన గుడిపాల పంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు పనిచేస్తున్న ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీలలో కూలీలకు పనులపై, అలాగే పనికి తగ్గ వేతనాలపై సలహాలు సూచనలు అందించారు. అలాగే ఒకటో తారీఖున గ్రామంలో అందించిన సామాజిక పింఛన్లను ఆయన చేతుల మీదుగా అందించారు. అలాగే గ్రామానికి చెందిన చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భోజంకి రామునాయుడు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లండ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర- రాజాం: రాజాం మండలంలో కంచరాం, రాజీపేట, ఆగూరు గ్రామాలలో పెన్షన్ల పంపిణీని ఎంపిడిఓ వావిలపల్లి శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించారు. ఉదయం నుంచే పలు గ్రామాలు సందర్శించి పర్యవేక్షించారు. పలు చోట్ల ఆయన కూడా పంపిణీ చేసారు.

ఎంపీ శ్రీభరత్‌ను కలిసిన మల్లు నాయుడు

విశాలాంధ్ర - వేపాడ: కొత్తవలస మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా చొక్కాకుల మల్లునాయుడు నూతనంగా నియమితులైన సందర్భంగా విశాఖ ఎంపీ శ్రీభరత్‌ని కలిశారు. అలాగే శృంగవరపుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి, రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పలరాం ప్రసాద్లతో కలిసి గురువారం విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే తనకు మార్కెట్ కమిటీ పదవి ఇచ్చినందుకు పార్టీకి విధేయతగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ పార్టీలో కష్ట పడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కలిపించే బాధ్యత ఎమ్మెల్యే లలిత కుమారి, నేను తీసుకుంటామని తెలిపారు.పార్టీ కోసం అహర్నిశలు మరింత కష్టపడాలని సూచించారు.

ప్రధాని అమరావతి పర్యటన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - చీపురుపల్లి: అమరావతి రాజధాని పనుల పున: ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్రానికి విచ్చేయుచున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి మల్ల నాయుడు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. విభజనతో రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి రైతులను ఒప్పించి ముప్పై వేల ఎకరాలు భూమిని సమీకరించి, రాష్ట్ర పరిపాలన అమరావతి నుంచే జరిగేలా తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నిర్మించటంతో పాటు ప్రధాని మోడీ సహకారంతో శాశ్వత రాజధాని నిర్మాణం కూడా చేపట్టారని తెలిపారు. కానీ జగన్మోహనరెడ్డి తాను కూడా అమరావతికి అనుకూలమని సంకేతాలతో ఎన్నికల్లో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో అమరావతికి తీరని ద్రోహం చేశారన్నారు. ఈ సమావేశంలో చీపురుపల్లి నియోజకవర్గ నాలుగు మండలాల నాయకులు రౌతు కామ నాయుడు, గవిడి నాగరాజు, కోట్ల మోతీలాల్, సన్యాసినాయుడు, పైల బలరాం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: రాజధాని అమరావతి పునః ప్రారంభానికి భారతదేశప్రదాని మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం శ్రీకారం చుడుతున్నారని ఈ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ టీడీపీ అధ్యక్షులు, సీనియర్ నేత, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కమిడి కళా వెంకటరావు పిలుపు నిచ్చారు. రాష్ట్ర

విభజనతో రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రైతులను ఒప్పించి ముప్పై వేల ఎకరాలు భూమిని సమీకరించి, రాష్ట్ర పరిపాలన అమరావతి నుంచే జరిగేలా తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నిర్మించటంతో పాటు ప్రధాని మోడీ సహకారంతో శాశ్వత రాజధాని నిర్మాణం కూడా చేపట్టారని వివరించారు.

రాజాం: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొనే అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభను విజయవంతం చెయ్యాలని రాజాం నియోజకవర్గం కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, మహిళలకు రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్మికులు, అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. పని లేని నాడు ఏ ఒక్క కార్మికుడు ఆకలితో ఉండరాదన్న లక్ష్యంతో అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏర్పాటు చేశారన్నారు. అమరావతి పునర్నిర్మాణం సందర్భంగా మే 2వ తేదీ శుక్రవారం జరిగే ప్రధాని నరేంద్రమోదీ సభలో రాజాం నియోజకవర్గం ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ కండక్టర్ బి.ఆర్.కుమార్‌కి సన్మానం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఆర్టీసీలో 29 సంవత్సరాలు కండక్టర్‌గా సేవలందించిన బి.ఆర్.కుమార్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కె.రమేష్ జ్ఞాపిక అందించి సన్మానం చేశారు. సిబ్బంది, ప్రయాణికులు అందించిన సేవలను కొనియాడారు. కుమార్ తమ సహోద్యోగులకు షడ్రుచుల భోజనం పెట్టి, తోటి మహిళ కండక్టర్లకు చీరలు, విశ్రాంత ఉద్యోగులకు పంచెలు బహుమతులుగా ఇచ్చారు. అలాగే 50,000 ఫిక్సిడ్ డిపాజిట్ చేసి, వడ్డీతో ఇబ్బంది గల ఉద్యోగులకు సహాయం చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్, అసోసియేషన్ నాయకులు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రగతీ శీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తమటాల అప్పలనాయుడు, రాయితీ సత్యంలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణం కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో ప్రగతీ శీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తమటాల అప్పలనాయుడు, రాయితీ సత్యంలు ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకట రమణ, తవిటి నాయుడు, కామినాయుడు, తమిరెడ్డి కృష్ణ, కూమార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - గుర్ల: శుక్రవారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు 33/11కెవి గుర్ల సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ అత్చుతాపురం ఫీడర్ లైనులో ఉన్నచెట్టు కొమ్మలు తొలగించుట కొరకు చోడవరం, పెనుబర్తి, చుక్కపేట, చింతపల్లి పేట, గంగిరెడ్డి పేట, అచ్యుతాపురం, తెట్టంగి, పోలాయివలస గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.త్రినాధరావు తెలిపారు.

ప్రాధమిక రంగాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

గజపతినగరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రమీలాగాంధీ

విశాలాంధ్ర-జామి: ప్రాధమిక రంగాలైన వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల ఆద్వర్యంలో ఆయా రంగాల అభివృద్ధికి తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని గజపతినగరం నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి ప్రమీలాగాంధీ సూచించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో స్వర్ణ ఆంధ్ర, విజన్ 2047పై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాధమిక రంగాలలో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రధానంగా మండలంలోని వ్యవసాయ స్థితిగతులను ఎవో పి. కిరణ్‌కుమార్ వివరించారు. మండలంలో మొత్తం 5256 ఎకరాలలో వరి విస్తీర్ణం ఉందన్నారు. అలాగే మండలంలో 6వేల హెక్టార్లులో పంటలు లేకుండా భూములు ఖాళీగా ఉన్నాయన్నారు. దీనిపై ప్రత్యేకాధికారి మాట్లాడుతూ వ్యవసాయ సాగు పెంచాలని, అలాగే ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాదికి దాదాపు 1196 హెక్టారులను వినియోగం లోకి తీసుకురావాలని ఎవోకు సూచించారు. ధాన్యం ఉత్పత్తి ఎకరాకు అదనంగా రెండు క్వింటాళ్ళు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖపై మాట్లాడుతూ పచ్చగడ్డి పెంపకంపై దృష్టి సారించాలని, కోళ్ళ ఫారాలలో ఉత్పత్తి పెంచేలా చూడాలని, పశువులలో పాలకు వెన్న శాతం పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని పశువైద్యాధికారులు డా. అప్పలనాయుడు, డా. నరేష్‌లకు సూచించారు. మత్స్యశాఖకు మండల స్థాయిలో అధికారి లేకపోవడంతో వాటి బాధ్యతను వ్యవసాయశాఖ ఎవోకు అప్పగించారు. ఈసమావేశంలో తహశీల్దార్ భరత్‌కుమార్, ఎంపిడివో నీలం అప్పలనాయుడు, ఎంఇవో జయశ్రీ, ఎపిఎం అప్పలనాయుడు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో విడుదలైన ఆరో తరగతి ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గర్భాం గ్రామానికి చెందిన తాడ్డి హాసిని 88 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమె తల్లిదండ్రులు శ్రీను ప్రైవేట్ కంపెనీలో పని చేయగా, తల్లి రమ గృహిణి. తమ కుమార్తెకు మండలంలో ప్రథమ ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు హర్షాన్ని వ్యక్తం చేశారు. గర్భాం గ్రామానికి చెందిన చెల్లూరి తనుష్ కుమార్ నాయుడు 87 మార్కులతో ద్వితీయ స్థానం పొందాడు. 86 మార్కులతో తృతీయ స్థానంలో సిరియాల ప్రదీప్ నాయుడు నిలిచాడు. ఆదర్శ పాఠశాల ప్రవేశపరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి ఎం.చంద్రశేఖర్‌తో పాటు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణ్ కుమారి అభినందనలు తెలిపారు. మొదటి పది ర్యాంకుల్లో 8 ర్యాంకులు గర్భాం గ్రామానికి చెందిన శ్రీ రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకోవడం పట్ల, గ్రామ పెద్దలు తాడ్డి వేణుగోపాలరావు, తాడ్డి సన్యాసినాయుడు, సత్తారు జగన్మోహన్రావు, సత్తారు శ్రీనివాసరావు, తాడ్డి. శ్రీధర్, తాడ్డి.చంద్ర శేఖర్, స్థానిక రవితేజ స్కూల్ కరస్పాండెంట్ విజినిగిరి. శంకర్ అభినందనలు తెలిపారు.

సింహాచలం ఘటన దురదృష్టకరం..

డీసీసీబీ చైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - చీపురుపల్లి: సింహాచలంలో జరిగిన ఘటన దురదృష్టకరమని.. అంతమంది భక్తులు చనిపోవడం బాధ కలిగిస్తోందని డీసీసీబీ చైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం చీపురుపల్లిలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ ఘటనపై వైకాపా నాయకులు మాట్లాడిన మాటలు సబబుగా లేవన్నారు. బొత్స లాంటి సీనియర్ నాయకులు కూడా ఇటువంటి పరిస్థితుల్లో శవ రాజకీయాలు చేయడం భావ్యం కాదన్నారు. ప్రజల మంచి చెడులను ఆలోచించి, వారిని సురక్షితంగా ఉంచాలని నిరంతరం ఆలోచించే ప్రభుత్వం ఇదని చెప్పారు. ఈ సంఘటన జరిగిన వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి.. మరణించిన వారికి పరిహారం

ప్రకటించడంతో పాటు, విచారణకు కూడా ఒక కమిటీని నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భక్తులు, అధిక సంఖ్యలో ప్రజలు చేరే ప్రదేశాల వద్ద ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి చేయాలి

విశాలాంధ్ర - బాడంగి: కార్మికుల అభ్యున్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని మండలంలో ఉన్న పలు సంఘాల కార్మికులు డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా అంగన్వాడి వర్కర్స్, ఆశ వర్కర్, ఉపాధి హామీ పథకం కూలీలు, మిడ్ డే మీల్స్ వర్క్స్, కార్మికులు మండల కేంద్రమైన బాడంగిలో కార్మికుల జెండా ఆవిష్కరణ గురువారం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు రవణమ్మ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర ప్రగతి కోసం కార్మికులు అనునిత్యం కష్టపడి పనిచేస్తారని అన్నారు.

వారంతా చాలీచాలని జీతాలతో అవస్థల గురవుతున్న ప్రభుత్వాలు తగు న్యాయం చేయడం లేదని విమర్శించారు. ముఖ్యంగా అంగనవాడి వర్కర్ల సమస్యలను సకాలంలో పరిష్కరించడం లేదని అన్నారు. కామ్రేడ్ సురేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యమత్యంతో పోరాడవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్, ఆశ వర్కర్స్ ఉపాధి కూలీలతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మే డే సందర్భంగా మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - రాజాం: రాజాంలో మేడే సందర్భంగా స్థానిక బొబ్బిలి సెంటర్‌లో, బస్టాండ్ ఆవరణలో, పాలకొండ రోడ్‌లో శ్రీ సాయినాధ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 'మజ్జిగ' చలివేంద్రం ఏర్పాటు చేసారు. మెకానిక్‌లు కృష్ణ, లక్ష్మణరావు, రమణ వెంకటరమణ తదితరుల ఆధ్వర్యంలో పలువురు మెకానిక్‌లు అసోసియేషన్ వలే సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా మజ్జిగ చలివేంద్రం నిర్వహించినట్టు తెలిపారు.

ఘనంగా కపిలేశ్వర ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - వంగర: మండలంలోని మద్దువలస గ్రామంలో వెలసిన కపి శేశ్వర ఆలయం 33వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జాడశశిభూసనరావు ఆధ్వర్యంలో కపిలేశ్వరునికి టెంకాయ పాలభిషేకాలు బిల్వపత్ర విభూది పంచామృతాలతో పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని నిర్వహించారు.

బజారులో నేటి నుండి షాపుల వినియోగం

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరం పంచాయతీలో బజార్ సెంటర్లో గల ఇటీవల కొత్తగా నిర్మితమైన షాపులను గురువారం నుండి వాడుకులోకి వచ్చినట్లు గ్రామ కార్యదర్శి జి.జనార్ధన్‌రావు తెలిపారు. ప్రజలందరూ బజారు సెంటర్‌ను వినియోగించుకొని కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం బీంపోలు పంచాయతీ సరియాపల్లి గ్రామ ప్రజలు తమ భూములు ఆక్రమించిన గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకరరావుని గురువారం విజయనగరం క్యాంప్ ఆఫీస్‌లో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తమ గ్రామంలో భూమిని గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కలిసిన వారిలో గ్రామ నాయకులు అప్పల కొండ,చిన్నయ్య, అశోక్, ఎం.పి.టి.సి సతీష్ తదితరులు ఉన్నారు. దీనిపై ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు సానుకూలంగా స్పందించి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు.